యనుమానించాను. కాని కించి దూపిరినొప్పిగా తేలిపోయింది. ఇంటికి తీసికొనివెళ్ళి సాయంకాలం బీచ్‌ని త్రిప్పు. అక్కడ 'ఒజోన్' అనే ప్రాణవాయువు బాగా పీల్చమను. బలం చేకూరుతుంది. గుళ్ళల్లోకి తీసికొని వెళ్ళకు. నీవున్నూ పోబోకు. పోయినా గర్భగుడిలోకి చొఱబడకండ" ని హెచ్చరించింది.

అన్నింటికీ కృష్ణమోహన్ 'వల్లె' అన్నట్టు తలత్రిప్పుతూ భార్యను సురక్షితంగా ఇంటికి తీసికొని వెళ్ళివాడు. మరుక్షణ మందే సాయంకాలం మెరీనాకు ప్రయాణం గావించి యిసుక మీద కూర్చోబెట్టుకు ఒంటరిగా ఆమె కళ్ళల్లోకి చూచేడు. ఆమె చిరునవ్వు నవ్వుతూ—"ఆలా నాకేసి చూడకండి. సముద్రంకేసి చూడండి!" అంది.

కృష్ణమోహన్—"నేను చూడలేను, సముద్రం చూసి నప్పుడల్లా నాకు హాలాహలం జ్ఞాపకం వస్తుంది" అన్నాడు.

"నాకేసి చూసినప్పుడు?"

"అమృత హారతి!" అన్నాడు. అప్రయత్నంగా. చల్లగా సముద్రపుగాలి వీస్తూనేవుంది.

.... .... .... .... ....

# చుంచన్న పరధ్యానం

ఏదోకథ చదివి—"గద్దమీద పిచ్చుక, పిచ్చుకమీద రంథ" అంటూ పాడుతూ కొనుక్కున్న కారపప్పూన పొట్లం దారిలోనే

ఆపాళంగా పావులా పొట్లం గద్ద తన్నుకుపోయిందట. "ఏమిరా?" అని యడిగితే—"ఆ పాట వ్రాసింది మీరే కాదూ? గద్ద క్రింద ఏమీ వ్రాశారు కారేం? అని ఆలోచిస్తుంటే నా చేతిలోని కారప్పూస పొట్లం గద్దెత్తుకు పోయిందండీ!" అన్నాడు మాచుంచన్న.

"వెధవా? వ్రాయకేం? వ్రాశాను. మనిషి కళేబరం" అని నేనే వెఱ్ఱి మొహం వేశాను. "కుఱ్ఱాళ్ళ కథలో కళేబరం, అని వ్రాయడం నాదే తప్పు. కారప్పూస పొట్లం అని వ్రాసి వుండవలసింది!" అని.

మఱోనాడు తవ్వెడు నూనె, సీసాలో పోయించుకు కోమటి కొట్టునుండి పట్టుకొస్తూ ఆ సీసాను స్తంభాన్నేసి కొట్టి నట్టుగా తగిలించినవాడై, అది బద్దలుకాగా నూనె గుడ్డలాళ్ళ లాగ యింటికి వచ్చాడు మాచుంచన్న, పైగా ఒకటి రెండు సీసాపెంకులు వాడి కాలిలో గుచ్చుకున్నాయి కూడాను.

"ఏమిరా? అంత గుడ్డిగా నడుచుకుంటూ ఏలా వచ్చావురా? ఎదరవున్న స్తంభంకూడా కానలేకపోయావు?" అని గద్దిస్తే—"నిన్న మీరేకాదు న్యూస్ చెప్పారు! సీసాల్లోకి గాంధి దూరి సీసాలన్నీ బద్దలు కొడుతున్నా" డని అంటూ ఎదిరించాడు. "ఓరి చవటా: భస్మాన్ని గురించి నేచెప్పానుగాని తైలాన్ని గురించి చెప్పానురా" అని వెంటనే నాకూ వాడికీ కూడా దిష్టి తీయించి పారేయించి లెంప వేసుకున్నాను.

మఱి మూడో గొడవ మరీ పెద్దది. ఒకరోజు పొద్దున్నే ఇంటి వాసం తెగ్గోస్తూ కప్పు పైకి లేవగొట్టెయ్యడాని కుద్యుక్తు

"ఏమిట్రా! ఉన్న కొద్దీ మతిపోతుంది నీక" ని అడిగితే అంటాడు—" మీరు మొన్నను అమ్మతో-'టేక్కప్పులో తుపాను' అన్నారుకదూ! అంటే అమ్మను—' మన కప్పు టేకు వాసమా కొడిశె వాసమా' అని యడిగాను. యడిగితే—' టేకు వాసమే' అంది. మరి టేక్కప్పవుతే యందులో తుపాను పడుతుందేమోనని తెగ్గోసేస్తున్నాను" అన్నాడు వాడు.

"అవునటే!" అని యడిగాను దాన్ని. "ఆఁ! మీరన్న మాట నిజం! వాడడిగిన మాట నిజం! కాని నేను మాత్రం వాసం కోసెయ్య మనలే" దంది. "ఓసి! తిన్నింటివాసాలు లెక్కేసేవాళ్ళే కాకుండా తెగ్గోసే వాళ్లకూడా అయినార్రా మీరిద్దరూను. నేను—'టీకప్పులో తుపాన' ని అన్నానుగాని— 'టేకప్పులో తుపాన' ని కాదు. అని అంటూ నాకు నేనే బుద్ధి చెప్పుకున్నాను. 'అప్రాచ్యుణ్ణి నేనే' అని యనుకుంటూ. కాకపోతే పాశ్చాత్యసామెత నీ భారత ఖండంలో నేను నొక్కి-వక్కాణించడం ఏమిటి? అందులోను వాళ్ళముందు? వాడి మాట అటుంచుందాం ఆ చుంచన్న మాటకేం! దానిముందు?

.... .... .... .... ....

## మోజామ్ తుడుపు

ఎన్నాళ్ళనుంచి పట్నం వీధులు తుడుస్తూన్నా భీముడుగాడి యిల్లూవాకిలీ భీముడుగాడి పిల్లాపీచూ పట్నంలోని పై వర్ణాల వాళ్ళకు తెలియదు. భీముడుగాడు కడజాతివాళ్ళల్లో కడజాతి వాడు. చేసేపని చిన్నప్పట్నుంచీ మునిసిపాలిటీవీధులు తుడవడమే.